క్లుప్తంగా

మంగళవాడ అధ్యక్షుడిగా తిమ్మప్ప



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని మంగళవాడ గ్రామ పంచాయతీ నూతన అధ్యక్షుడిగా సణ్ణ తమ్మప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఎన్నికలో సణ్ణ తిమ్మప్ప మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, తహసీల్దార్ వరదరాజు అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షురాలు అంజలి, పీడీఓ గంగాధరప్ప, సభ్యులు, గ్రామ పెద్దలు నూతన అధ్యక్షుడు సణ్ణ తిమ్మప్పను ఘనంగా సన్మానించి అభినందించారు.

ప్రతిభా పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

పావగడ: తాలూకా వ్యాప్తంగా 2023–24 ఏడాదికి సంబంధించి రెండో సంవత్సరంలో పీయూసీలో 90 శాతం కంటే అధికంగా మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు తేజస్ ఎడ్యుకేషన్, చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గాయత్రి శంకరమూర్తి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు సన్మాన పత్రంతో పాటు ప్రతి ఏడాది మాదిరి గనే ప్రోత్సాహక నగదు అందిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ బయోడేటాతో పాటు ఫోటో, మార్కుల జాబితా జిరాక్స్‌తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 25వ తేదీ లోపల దరఖాస్తులు అందించాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9480348594ను సంప్రదించాలన్నారు. 25వ తేదీ ఉదయం పట్టణంలో ఉన్న తేజస్ లాడ్జ్ హర్షిత కన్వెన్షన్ హాల్ 3వ అంతస్తులో ప్రతిభా పురస్కరాల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

చేనేతల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న మంత్రి సవిత

సోమందేపల్లి/పెనుకొండరూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేనేతల సంక్షేమానికి కృషి చేస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖా మంత్రి సవిత తెలిపారు. ఆదివారం మండల కేంద్రమైన సోమందేపల్లిలోని ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అందరి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం భారీ ర్యాలీగా పెనుకొండకు వెళ్లారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొదటిసారి రావడంతో కార్యకర్తలు, అభిమానులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి ఆమె పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఆలయానికి దారి చూపండి



కొండ కింద వెలసిన గ్రామ దేవతల ఆలయం

పావగడ: తాలూకాలోని వీరమ్మనహళ్లి గ్రామం సర్వే నంబర్ – 5 లోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన గౌడ సంద్రం మారెమ్మ, నసన కోట ముత్యాలమ్మ, బోయ కొండ గంగమ్మ, బళ్లారి దుర్గమ్మ గ్రామ దేవతల ఆలయానికి దారి కల్పించాలని ఆలయ ప్రధాన అర్చకుడు రామాంజినప్ప కోరారు. ఈమేరకు స్థానిక తహసీల్దార్ వరదరాజుకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి మంగళ, శుక్రవారాలతో పాటు పున్నమి, అమావాస్య రోజుల్లో వందలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుంటుంటారని చెప్పారు. ఇన్నాళ్లూ ఆలయం చుట్టు పక్కల ఉన్న రైతుల పట్టా భూముల్లో దారి ఏర్పాటు చేసుకుని భక్తులు ఆలయానికి వచ్చేవారని తెలిపారు. అయితే ఇటీవల సంబంధిత భూ యజమాని తమ భూమిలో ఆలయానికి దారి ఇవ్వమని దారికి కంప చెట్లు అడ్డుగా వేశారన్నారు. వెంటనే తహసీల్దార్ వరదరాజు సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల రాజీనామా

రొద్దం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా చేస్తున్నారు. ప్రభుత్వం మారడంతో టీడీపీ నాయకులు ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి ఫీల్డ్ అసిస్టెంట్లను మార్చాలని అధికారులపై ఒత్తిళ్లు తీసుకొచ్చారని, అధికారుల ఆదేశాల మేరకు స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు తెలిపారు. ఇప్పటికే రొద్దం ఫీల్డ్ అసిస్టెంట్ షామీర్‌బాషా, దొడగట్ట ఫీల్డ్ అసిస్టెంట్ శేషమ్మ రాజీనామా చేశారు. సోమవారం మిగిలిన వారు కూడా రాజీనామా చేస్తారని తెలియజేశారు. పనులకు సంబంధించిన రికార్డులు తమకు అందజేయాలని అధికారులు చెప్పినట్లు క్షేత్రస్థాయి సహాయకులు తెలిపారు.

నేడు 'మీకోసం'

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మీ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను మీకోసం కార్యక్రమంలో అర్జీల రూపంలో సమర్పించాలన్నారు. అధికారులు మీకోసం కార్యక్రమానికి విధిగా హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పైకి మినరల్... లోపల జనరల్!



- మినరల్ వాటర్ పేరిట జోరుగా విక్రయాలు
- నాణ్యతా ప్రమాణాలకు పాతర
- ఒకే బ్రాండ్ పేరుతో అక్షరాలు మార్చి మోసం
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

దుకాణాలు, హోటళ్లు, చాయ్ కేఫ్‌లు ఇప్పుడు ఎక్కడ చూసినా సాధారణ నీటికి బదులు మినరల్ వాటర్ బాటిళ్లనే ప్రజలు ఎక్కువగా కొంటున్నారు. దీన్ని ఆసరాగా తీసుకొని కొందరు అక్రమార్కులు జోరుగా మినరల్ వాటర్ పేరిట దందా చేస్తున్నారు. రకరకాల బ్రాండ్ల పేర్లలోని అక్షరాలను మారుస్తూ ఒరిజినల్‌లకు ఏమాత్రం తీసిపోకుండా ప్యాకింగ్ చేసి అమ్ముతూ జేబులు నింపుకుంటున్నారు.

హిందూపురం: నియోజకవర్గంలో నకిలీ మినరల్ వాటర్ బాటిళ్ల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. రైల్వేస్టేషన్లు, బస్టాండ్ ఇతర రద్దీ ప్రాంతాల్లో దందా సాగిస్తున్నారు. ఒరిజినల్ బ్రాండ్ల రంగుల్లో కేవలం బ్రాండ్ పేరులోని ఒక్క అక్షరాన్ని మార్చేస్తూ జనాన్ని బురిడి కొట్టిస్తున్నారు. చాలా మంది విషయం తెలియక అసలైందే అనుకొని ఆ నీటిని తాగేస్తున్నారు.

వందకు పైగా యూనిట్లు

హిందూపురం పట్టణ పరిసరాల్లో 100కు పైగా మినరల్ వాటర్ యూనిట్లు నీటి పంపింగ్ మోటర్ల ద్వారా ట్యాంకర్లలో నింపి రిటైల్‌గా విక్రయిస్తున్నారు. నీటిని శుద్ధి చేస్తారా? లేదా? అనే సంగతి ఎవరికీ సరిగ్గా అర్థం కాదు. వాటర్ ప్లాంట్లు లేకుండా బోర్ల నీటిని నింపి మినరల్ పేరిట విక్రయించే ట్యాంకర్లు ఎన్నో ఉన్నాయి. నీటి అక్రమాల వ్యవహారంపై నిగ్గు తేల్చాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్, ఆహార కల్తీ నిరోధకశాఖ, ఫుడ్ కంట్రోలర్ అధికారులు, మున్సిపల్‌శాఖ సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో వారి దందాకు అడ్డే లేకుండా పోయింది.

నిబంధనలు ఇలా...

మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే తొలుత బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్)కు దరఖాస్తు చేసుకోవాలి. లేకపోతే ఐఎస్ఐ (ఇండియన్ స్టాండర్డ్ ఇన్‌స్టిట్యూట్) ద్వారా అనుమతులు పొందాల్సి ఉంటుంది. ముంబై, చెన్నైలో ఉన్న ఆ సంస్థలు తమ బృందాన్ని పంపి నీటి నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేస్తారు. బోరు పాయింట్ నుంచి వచ్చే నీళ్లను ల్యాబ్ పంపి అన్ని రకాల పరీక్షలు చేస్తారు. ఆపైన అనవసర లవణాలను తీసివేసి ఆరోగ్యదాయకమైన నీటిని తయారు చేయాల్సి ఉంటుంది. అన్ని సంతృప్తికరంగా ఉంటేనే ఐఎస్ఐ మార్క్ సర్టిఫికెట్ జారీచేస్తారు. ఈ ప్లాంటుకు సంబంధిత అనుమతి, స్ట్రక్చర్ తదితరాలను మాత్రం పంచాయతీ, మున్సిపల్ అధికారులు పరిశీలిస్తారు. ఈ అనుమతులు తతంగమంతా వాటర్ ట్యాంకర్లు, బ్యాటళ్ల సిద్ధం చేసే ప్లాంట్ వద్ద కనిపిస్తే ఒట్టు. మరికొందరు నామమాత్రంగా చెన్నైలో బయోహెర్బల్ సంస్థ నుంచి సర్టిఫికెట్లను తెచ్చుకొని నీటివ్యాపారాన్ని సాగిస్తున్నారు. ఇప్పటికైనా ఈ అక్రమాలపై జిల్లా యంత్రం దృష్టిసారించి ఆరోగ్యాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.





అధికారులకు పట్టదా?



హిందూపురంలో ఎటు చూసినా డూప్లికేట్ మినరల్ బాటిళ్ల దందా సాగుతోంది. నాణ్యత ప్రమాణాల గురించి అడిగితే ఎవరో ఇచ్చారు ఇష్టముంటే కొను లేకపోతే వదిలేయ్ అంటున్నారు. ఇలాంటి నీటిని తాగితే అనారోగ్య సమస్యలు తప్పవు. ఇంత జరుగుతున్నా జిల్లా ఆహార కల్తీ నిరోధకశాఖ ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు.

– ఉదయ్‌కుమార్, హిందూపురం

నిర్వాహకులపై చర్యలు తప్పవు



నకిలీ వాటర్ బాటిళ్ల విక్రయాలపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా వాటర్ ప్లాంట్లు వ్యాపారాలు, ట్యాంకర్లతో నీటి విక్రయాలు కొనసాగుతున్నాయి. ఇదే విషయం కౌన్సిల్‌లో అధికారులకు కూడా తెలియజేశాము. ఈ వ్యవహారంపై అధికారులతో చర్చించి చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

– ఇంద్రజ, మున్సిపల్ చైర్‌పర్సన్

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని సిద్దగిరి గ్రామంలో ఆదివారం డీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక హనుమంతు ఆధ్వర్యంలో సర్పంచ్ రంగనాథ్, ప్రజలతో కలిసి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. గ్రామ ప్రజల సహకారంతో భూమి పూజ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భారత రాజ్యాంగం ద్వారానే దేశంలోని ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


హంపన మృతి తీరని లోటు



సంతాపం తెలుపుతున్న కసాప పదాధికారులు

పావగడ: సాహితీ వేత్త డాక్టర్ కమల హంపన మృతి సాహిత్య లోకానికి తీరనిలోటని స్థానిక కసాప అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. డా కమల హంపన (88) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఈ సందర్భంగా పట్టణంలోని గురుభవన్ లో ఆదివారం ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ఉత్తమ సాహితీ వేత్తల్లో ఒకరైన హంపన సమకాలీన కన్నడ సాహిత్యంలో గుర్తింపు పొందారన్నారు. ఇటీవల జరిగిన 71వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం అధ్యక్షురాలిగా కీర్తి ప్రతిష్టలు పొందారన్నారు. కార్యక్రమంలో కసాప కార్యదర్శి ఈ.నారాయణప్ప, మద్దుబండె విశ్వనాథ్, అంతరగంగ శంకరప్ప, చన్నబసవణ్ణ, హోమా నాగరాజు, ఇమ్రాన్, రిజ్వాన్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎండిన చెట్టును తొలగించండి



ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఎండిపోయిన చింత చెట్టు

మడకశిరరూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఎండిపోయిన చింత చెట్టును తొలగించి ప్రమాదం జరగకుండా చూడాలని విద్యార్థులు, క్రీడాకారులు విజ్ఞప్తి చేశారు. ఉదయం, సాయంత్రం సమయంలో మైదానంలో ఆటలు ఆడుకుంటుంటామని, ఆ సమయంలో కొద్దిపాటి గాలివీస్తే చిన్న చిన్న చెట్టు వద్ద కొమ్మలు పడుతున్నాయన్నారు. ఏ ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని ఎండిపోయిన చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

25 లోపు పాఠశాలలో చేరండి

హిందూపురం టౌన్: పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం తరగతుల్లో ప్రవేశం కోసం బార్గ్‌సెట్ రాసి సీట్లు సాధించిన విద్యార్థులు ఈ నెల 25 లోపు గురుకులంలో అయా తరగతుల్లో చేరాలని గురుకులం ప్రిన్సిపాల్ నాగమణి పేర్కొన్నారు. ఒక వేళ విద్యార్థులు చేరకపోతే ఆ తరువాత మెరిట్ లిస్ట్‌లో ఉన్న విద్యార్థులకు ఆ సీట్లను కేటాయించడం జరుగుతుందన్నారు. అందువల్ల ఇప్పటికే సీట్లు దక్కిన విద్యార్థులు 25వ తేదీలోపు పాఠశాలలో చేరాలని కోరారు.

ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల కోసం పనిచేద్దాం



వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి

- వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి

హిందూపురం: ప్రతి పక్షంలో ఉన్నా ఐక్యమత్యంతో ప్రజా సమస్యల పోరాటం పనిచేద్దామని హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి అన్నారు. హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో ఆదివారం మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, ఇన్‌చార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వేణురెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో కష్టపడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ అధికారంలో లేకపోయినా ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి పక్షంలోనూ ప్రజల మంచి కోసమే పని చేద్దామన్నారు. ఏ దాడులనైనా ఎదురిద్దామన్నారు. స్థానిక సంస్థల్లో మన బలం అలాగే ఉందన్నారు. ఎవరు భయపెట్టినా, ప్రలోభపెట్టినా ప్రజలు మనకు ఇచ్చిన అవకాశాన్ని, అధికారాన్ని ఉపయోగించుకొని నిస్వార్థంగా పనిచేద్దామన్నారు. నాయకులు, కార్యకర్తలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అందుబాటులోనే ఉంటానన్నారు. మనం అధికారంలో ఉన్నప్పుడు ఎవరినీ ఇబ్బందులకు గురిచేయలేదని, అది ప్రస్తుతం అధికారపక్షంలో నాయకులందరికీ తెలుసన్నారు. హిందూపురం నియోజకవర్గంలో ఆ సంస్కృతి ఎన్నాడూ లేదన్నారు. గెలుపోటములు ఎన్నికల వరకే అని తర్వాత అందరమూ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజలకు మంచి చేయడానికి కలిసి కృషిచేద్దామన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, సానుభూతి పరులపై దాడులు జరిగినా ఐక్యతతో ఎదుర్కోవడానికి అందరూ సిద్ధపడాలన్నారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులుగా పదవీకాలం పూర్తయేంత వరకూ ప్రజలకు మంచి చేయడానికి ఎవరికీ భయపడాల్సిన పనిలేదన్నారు. అధికార పార్టీ నేతలు ఎవరైనా దాడులు చేసినా, ఇబ్బంది పెట్టినా ప్రభుత్వానికి తెలియజేస్తామని, వారు స్పందించకపోతే కేంద్ర, రాష్ట్ర మానవ హక్కుల సంఘం, సంబంధిత పోలీస్ ఉన్నధికారులకు ఫిర్యాదు చేద్దామని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం అనంతరం పూలతో ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

రొళ్ల: మండల పరిధిలోని తిరుమలదేవరపల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజ రోజు కావడంతో గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారి మూల ప్రతిమను గంగా జలంలో శుద్ధి చేసి అభిషేకించారు. అనంతరం వెండి ఆభరణాలు, పూలతో అలంకరించి మహామంగళ హారతి ఇచ్చారు. పలువురు భక్తులు ఆలయ ఆవరణలో వంటకాలు చేసి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. తర్వాత భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



ముద్దిరెడ్డిపల్లిలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హిందూపురం: జనసంఘ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, బీజేపీ మూల సిద్ధాంతకర్తల్లో ఒకరైన డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకొని బలిదాన్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం లక్ష్మీపురం శక్తికేంద్రం, ముదిరెడ్డిపల్లి అరవింద్‌నగర్లలో బీజేపీ రాష్ట్ర నాయకుడు పార్థసారథి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి, జిల్లా యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మారుతీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని జరిపారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 370 ఆర్టికల్‌కై పోరాడి అమరుడైన దేశభక్తుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు జయకృష్ణ, , అంజనమ్మ, కిష్టప్ప, బాల గోపాల్, సునీల్, రమేష్, నాగేష్, నరసింహులు, మహేష్ నాయక్, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

కూర గాయాలు

కూరగాయలు	గత వారం ధర	ప్రస్తుత ధర
టమోట	రూ.50	రూ.100
ఉల్లి	50	50
బీన్స్	100	120
క్యారెట్	100	120
ఆలుగడ్డ	80	100
వంకాయ	60	60
మునగకాయ	80	100
బెండకాయ	80	100
ముల్లంగి	60	80
పచ్చి మిరప	100	120
ఆకుకూర కట్ట ఒకటికి రూ.10 కొత్తిమిర కట్ట రూ.30 పలుకుతోంది.		



అమరాపురంలో కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

- కూరగాయలు, ఆకుకూరల ధరలు పైపైకి..
- ఏం తినాలో అర్థం కావడం లేదని సామాన్యుల ఆవేదన

అమరాపురం: ప్రస్తుతం మార్కెట్లో కూరగాయలు, ఆకు కూరల ధరలు ఆకాశాన్నంటుతుండటంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏమి కొనాలో ఏమి తినాలో అర్థం కావడం లేదని వాపోతున్నారు. వారం రోజుల క్రితం ఉన్న ధరలు ఈ వారం ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌కు రూ.500 నోటు తీసుకెళ్లినా కూరగాయల సంచి కూడా రావడం లేదంటున్నారు. ఆకు కూరల ధరలు కూడా మండిపోతున్నాయి. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పెరిగిన ధరలను తగ్గించాలని కోరుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది



మాది పేద కుటుంబం. నిత్యం కూలీ చేస్తేగాని పూట గడవదు. వారపు సంతలో కూరగాయలు కొందామని వస్తే ధరలు ఆకాశమంత ఎత్తులో ఉన్నాయి. ఏమి కొనుగోలు చేయలేక కేవలం మిరప, వంకాయ కొన్నా. దీనికి రూ.150 ఖర్చు అయింది. మాలాంటి వారికి చాలా ఇబ్బందిగా ఉంది.

– లక్ష్మీదేవి, కూలీ, అమరాపురం

ఏం తిని బతకాలి ?



మార్కెట్‌లో టమాట ధర విని షాక్ అయ్యా. కేజీ టమాట ధర రూ.100 చెప్పారు. నిజంగా నాకు భయం వేసింది. నేను బేల్దారి పని చేస్తా. రోజుకు రూ.600 ఇస్తారు. దానితోనే కుటుంబాన్ని నెట్టుకు రావాలి. అయితే ఒక్కసారిగా కూరగాయల ధరలు ఇలా పెరిగితే ఏం తిని బతకాలో ప్రభుత్వమే చెప్పాలి.

– శివరాజ్, బేల్దారి, దేవగానపల్లి, అమరాపురం మండలం.

ధరలు నియంత్రించాలి



ప్రస్తుతం మార్కెట్లో ఉల్లి, టమాట ధరలు విపరీతంగా పెరిగాయి. వాటిని నియంత్రించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. నేను పెయింటింగ్ పనులకు వెళతాను. దినసరి కూలీ పని చేసి వచ్చిన డబ్బుతో కుటుంబ పోషణ చేస్తున్నా. ఇంటి సరుకులు, కూరగాయలు, ఆకు కూరలు తదితర వాటికి డబ్బు చాలడం లేదు.

– హనుమంతరాయ, కూలీ, తమ్మదేపల్లి

15 నుంచి పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాలు



ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: స్థానిక ముద్దిరెడ్డిపల్లిలో వెలసిన రుక్మిణి పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు జూలై 15 నుంచి 19వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పల్లా లక్ష్మీకుమార్, ధర్మకర్త చింతా గోపాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆలయంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వామి వారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో రామాంజినేయులు, గోపాల్, లక్ష్మీనారాయణ, పురుషోత్తం, భాస్కర్, భార్గవ రాముడు తదితరులు పాల్గొన్నారు.